అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి : ఉపసర్పంచ్‌లు

పెద్దేముల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త: ఉపసర్పంచ్‌లు చేస్తున్న ప్రజాసేవలను గుర్తించి,తమకు అభివృద్ధి కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నందిని డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అడిషనల్ కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నందిని మాట్లాడుతూ ఉపసర్పంచ్‌ల చెక్ పవర్ విషయంలో వస్తున్న పుకార్లను కొట్టివేస్తు ముందు ఉన్న విధంగా యధావిధిగా కొనసాగించేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ పరంగా తమ సేవలను గుర్తించి రూ. 5 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.అభివృద్ధి పనుల శంఖుస్థాపన శిలాఫలకాలపై తమ పేర్లు ఉండే విధంగా చూడాలని అన్నారు.పంచాయతీ పరిపాలన పరమైన ప్రతి తీర్మాణంపై సర్పంచ్, కార్యదర్శితో పాటు తమ సంతకం ఉండేలా చూడాలని అన్నారు.మండల సర్వసభ్య సమావేశాలకు ఉపసర్పంచ్‌లకు ఆహ్వానం ఉండే విధంగా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలు, జిల్లా ఉపాధ్యాక్షులు లక్ష్మీకాంత్, పెద్దేముల్ మండల ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దివై ప్రసాద్, ఉపాధ్యాక్షులు జైపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్‌లు హీరాసింగ్, రాంరెడ్డి, లక్ష్మప్ప, నయ్యూం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న ఉపసర్పంచ్‌లు

ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

-అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 11,ప్రభాతవార్త : రాబోయే ఖరీఫ్ 2026-27 ధాన్యం సేకరణ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ 1వ తేదీ నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో సిద్ధం చేసి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, ఇతర సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే కనీస మద్దతు ధర , ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు విధానానికి సంబంధించిన వివరాలను రైతులకు స్పష్టంగా తెలిసేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వం గుర్తించిన సన్న రకం ధాన్యం వివరాలను పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు చేసి, సంబంధిత కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ఎలాంటి జాప్యం లేకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.డిఆర్ డి ఓ , సహకార శాఖలు సెప్టెంబర్ 30వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని సూచించారు.ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్దేశించిన 16 మౌలిక సదుపాయాల ప్రమాణాలు తప్పనిసరిగా అమలయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులతో ముందస్తుగా సమన్వయం చేసుకుని, కేంద్రాల ప్రారంభంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.ధాన్యం కొనుగోలు అనంతరం రైస్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన హమాలీలు, లారీలను ముందుగానే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిబంధనలు, ధాన్యం నాణ్యత ప్రమాణాలు, గ్రేడింగ్ తదితర అంశాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని ఆదేశించారు.

ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వనజాత, ఇంచార్జీ డీఎం సివిల్ సప్లయ్ స్వప్న, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి మహమ్మద్ రియజుద్దీన్, డీసీసీఓ సుధాకర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతూన్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

విమోచన చరిత్రను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

-షాద్‌నగర్‌లో ఘనంగా బిజెపి తిరంగా ర్యాలీ -అమరవీరులకు ఘన నివాళులు

షాద్‌నగర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త : తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తా నుంచి శుక్రవారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా, బీజేపీ షాద్‌నగర్ ఇన్‌చార్జ్ అందే బాబన్న, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబట్టి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు, దేశభక్తులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ జెండాల రెపరెపల మధ్య సాగిన ర్యాలీ భారత్ మాతాకీ జై", వందే మాతరం" జై హింద్" నినాదాలతో షాద్‌నగర్‌ను మార్మోగించింది. ఈ సందర్భంగా నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం లభించగా, హైదరాబాద్ సంస్థానానికి 1948 సెప్టెంబర్ 17న విముక్తి లభించిందన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దౌర్జన్యాలను ఎదురించి తెలంగాణ ప్రజలు, రైతులు, యువత, మహిళలు స్వేచ్ఛ కోసం అనేక త్యాగాలు చేశారని గుర్తుచేశారు.సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన రోజని, హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన ఈ చారిత్రక ఘట్టాన్ని తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.తెలంగాణ విమోచన పోరాట చరిత్రను విస్మరించడం సరికాదని, అమరవీరులకు తగిన గౌరవం కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించే వరకు బీజేపీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. బీజేపీ షాద్‌నగర్ ఇన్‌చార్జ్ అందే బాబన్న మాట్లాడుతూ, తెలంగాణ విమోచనం కోసం పోరాడిన వీరుల త్యాగాలను నేటి తరం ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. సెప్టెంబర్ 17 చరిత్రను ప్రతి గ్రామానికి, ప్రతి విద్యార్థికి చేరేలా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విమోచన పోరాటంలో పాల్గొన్న వీరుల చరిత్రను పాఠ్యాంశాలు, ప్రజా కార్యక్రమాల ద్వారా భావితరాలకు తెలియజేయాలని కోరారు.పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ విమోచన పోరాటంలో అనేక మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి పోరాట చరిత్రను భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అమరవీరుల త్యాగాలకు గౌరవ సూచకంగా ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం దేశభక్తి నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో దేపల్లి అశోక్ గౌడ్, ప్యాట అశోక్, మచ్చ సుధాకర్, వంశీకృష్ణ, మురళి, అమ్ము డాపురం నరసింహ, ఈసనాతి శీను, పిట్టల సురేష్, అరవింద్, పుట్నాల సాయి, ఉదయ్ గౌడ్, రిషి, రణధీర్, రాజు, శీను, మల్లేష్, రఘు, రవి నాయక్, సాయికుమార్, ఉదయ్ కుమార్, వివేక్, అభిలాష్, గట్టు శివ, వేణుగోపాల్, రాకేష్, చందు, పవన్, రాఘవేంద్ర, శివ, వినోద్, శ్రీను, చౌల భాస్కర్, గంధకార్, కుమారి మహేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రూ.1.50 కోట్ల హాషిష్ ఆయిల్ పట్టివేత..

ముగ్గురు అరెస్ట్.. 11 కిలోల ఆయిల్ స్వాధీనం

రంగారెడ్డి అర్బన్ సెప్టెంబర్ 11,ప్రభాతవార్త :

హాషిష్ ఆయిల్ అక్రమ రవాణా చేస్తున్న ముఠాను ఫ్యూచర్ సిటీ పోలీసులు ఛేదించారు. ఎస్ఓటీ మహేశ్వరం జోన్, కందుకూరు పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, సుమారు రూ.1.50 కోట్ల విలువైన 11 కిలోల హాషిష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకొని వీరి నుంచి రెండు మొబైల్ ఫోన్లు, మారుతి స్విఫ్ట్ కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.మొరుపోజు రవి వర్మ (27), జర్పుల లోకేష్ అలియాస్ లోకి (26), సయ్యద్ సోహైల్ హుస్సేన్ (27)గా గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శ్రీశైలం హైవేపై నవరు బాలరెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా వస్తున్న స్విఫ్ట్ కారును అడ్డుకున్నారు. తనిఖీ చేయగా 11 పారదర్శక ప్యాకెట్లలో హాషిష్ ఆయిల్ బయటపడిందని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి తెలిపారు. విచారణలో లంబసింగికి చెందిన బన్నీ అనే సరఫరాదారు నుంచి రూ.9.5 లక్షలకు డ్రగ్ కొనుగోలు చేసినట్లు నిందితులు వెల్లడించినట్లు తెలిపారు. లంబసింగి నుంచి హైదరాబాద్‌కు తరలించి విక్రయించేందుకు ఖమ్మం, మిర్యాలగూడ, దేవరకొండ, కల్వకుర్తి, కందుకూరు మార్గాన్ని ఎంచుకున్నట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై కందుకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. డ్రగ్స్ సరఫరా గొలుసును ఛేదించేందుకు ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని ఫ్యూచర్ సిటీ పోలీసులు తెలిపారు. ఈ ఆపరేషన్ మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి, ఫ్యూచర్ సిటీ ఎస్ఓటీ అదనపు డీసీపీ షేక్ జహంగీర్, మహేశ్వరం డివిజన్ ఏసీపీ ఎస్. జనకి రెడ్డి,కందుకూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హెచ్. వెంకటేశ్వర్లు, ఎస్ఓటీ మహేశ్వరం జోన్ ఇన్‌స్పెక్టర్ టి. రవి కుమార్ మార్గదర్శకత్వంలో ఎస్ఓటీ, కందుకూరు పోలీస్ బృందాలు నిర్వహించాయి

జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో అమరవీరుల దినోత్సవం

వికారాబాద్, ప్రభాతవార్తః జిల్లా అటవీ కార్యాలయంలో శుక్రవారం అటవీ శాఖ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అటవీ సంపద, వన్యప్రాణులు, ప్రకృతి పరిరక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అటవీ శాఖ అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అటవీ అధికారి విశాల్ బత్తుల అమర వీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు.ఈకార్యక్రమంలో వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.శ్యామ్ కుమార్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి.నాగేశ్వర్ రావు, ధారూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.రాజేందర్, కొడంగల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి.విజయ్ కుమార్, పరిగి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.ప్రతిమ అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళ్ళు అర్పించిన డీఎఫ్ఓ, ఇతర అధికారులు

వృద్ధుడిని చితకబాదిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు

వికారాబాద్, ప్రభాతవార్తః

ఓ వృద్ధుడిని విచక్షణారహితంగా చితకబాదిన కానిస్టేబుల్ పై కేసు నమోదు చేసిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రఘుకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలంపల్లి ఎంఐజీ కాలనీలో ఉంటున్న అనంతయ్య అనే వృద్ధుడు శుక్రవారం అదే కాలనీకి చెందిన గణేష్ అనే వ్యక్తి ఇంటి ముందు సైకిల్ నిలిపాడు. దీంతో గణేష్ తల్లి అనంతయ్య ను బూతులు తిట్టడంతో వారి మధ్య మాట మాట పెరిగింది. అప్పుడే వచ్చిన గణేష్ వృద్ధుడు అనంతయ్య ను కర్రతో విచక్షణారాహిత్యంగా చితకబాదాడు. దీంతో అనంతయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గణేష్ నగరంలోని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నట్లు బాధితుడు తెలిపాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుకుమార్ తెలిపారు.

నిలిచిన యాలాల శివసాగర్ ప్రాజెక్టును పూర్తి చేయండి

-శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

యాలాల సెప్టెంబరు 11,ప్రభాతవార్త :

రెండున్నర దశాబ్దాలుగా అర్ధాంతంగా ఆగిపోయిన యాలాల శివసాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర శాసన సభ సమావేశాల్లో భాగాంగా శాసన పరిషత్తు 26వ సెషన్ సెకండ్ మీటింగ్ నాలుగో రోజూ శుక్రవారం మండలిలో ప్యానల్ చైర్మన్ భానుప్రసాద్ రావు అధ్యక్షతన సమావేశం ప్రత్యేక ప్రస్తావన అంశాలలో భాగంగా మహేందర్‌రెడ్డి శివసాగర్ ప్రాజెక్టు గురించి లేవనెత్తారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో కాక్రవేణి నదిపై నిర్మిస్తున్న ప్రాజెక్టు అర్ధాంతరంగా నిలిచిపోయి ఇప్పటివరకు పూర్తి కాలేదని చెప్పారు. తాండూరు నియోజకవర్గం యాలాల మండలంలో శివసాగర్ ప్రాజెక్టు రెండు దశలుగా నిర్మాణం పనులు కొనసాగాయన్నారు. 2006లో జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా రూ.4కోట్ల70లక్షల నిధులతో ప్రాజెక్టు పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. యాలాల మండలంలోని యాలాల, విశ్వనాథ్ పూర్, సంగెం ఖుర్ద,హాజీపూర్,క్రిష్టాపూర్ తదితర గ్రామాలకు చెందిన సుమారు రెండు వేల ఎకరాలకు సాగునీటిని అందించే విధంగా ప్రాజెక్టు పనులు కొన సాగాయని ఆయన వెళ్లడించారు. 2018 సంవత్సరంలో రెడవ సారి తాను మంత్రిగా ఉన్నప్పుడు శివసాగర్ ప్రాజెక్టు నిర్మానానికి రూ.11 కోట్ల,41 లక్షల నిధులు మంజూరు చేశానని మహేందర్‌రెడ్డి గుర్తుచేశారు.ప్రాజెక్టు కుడి,ఎడమ కాల్వల నిర్మాణ పనులు,తూములు భిగించేందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.సకాలంలో అలుగు నిర్మాణ పనులు జరగకపోవడంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడం జరిగిందని ఆయన తెలిపారు.ఇంకా రూ.5కోట్ల నిధులు మిగిలి ఉన్నా కాంట్రాక్టర్ పనులు చేయడంలేదని మహేందర్‌రెడ్డి ప్రస్తావించారు.కుడి,ఎడమ కాల్వల నిర్మాణ పనులు సుమారు మూడు,నాలుగు కిలోమీటర్ల మేర పూర్తయ్యాయని,భూ సేకరణ చేపట్టి ఇంకా మిగిలిఉన్న కాలువల నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రాజెక్టు నిర్మాణం ఆర్ధాంతరంగా ఆగిపోవడంతో కాక్రవేణి జలాలు కాగ్నా నదిలో కలిసి కర్ణాటక రాష్ట్రానికి వృధాగా తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.దశాబ్దాలుగా నిలిచిపోయిన శివసాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రభుత్వం వెంటనే పూర్తి చేసి యాలాల రైతాంగానికి సాగునీటిని అందించాలని మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదన విరమించుకోండి

అసెంబ్లీలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త :

షాద్‌నగర్ నియోజకవర్గంలోని సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు ప్రతిపాదనను పూర్తిగా విరమించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఎమ్మెల్యే.. డంపింగ్ యార్డ్ ఏర్పాటును సిద్దాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ప్రతిపాదనకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు కొనసాగిస్తున్న విషయాన్ని సభ దృష్టికి తీసుకెళ్లారు.షాద్‌నగర్ ప్రాంతం హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత సమీపంలో ఉందని ఎమ్మెల్యే శంకర్ పేర్కొన్నారు. ఇలాంటి కీలక ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్‌లో పర్యావరణపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా విరమించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు.

పాడి రైతుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం వివిధ రకాలుగా అండగా నిలుస్తున్నప్పటికీ, రైతుల ఆదాయాన్ని మరింత పెంచేందుకు పశు సంవర్ధక రంగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. నేడు అసెంబ్లీలో పశు సంవర్ధక శాఖపై జరిగిన చర్చలో ఆయన పాడి రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా పాడి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో పశు వైద్యులు లేకపోవడంతో పశువులకు వైద్యం అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ప్రాంతంలో పాడి రైతులకు సకాలంలో పశు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా రాష్ట్రంలో పాల ఉత్పత్తిని పెంచేందుకు విజయ డైరీ ద్వారా పాడి రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. పాడి రైతులకు అవసరమైన సబ్సిడీలు అందించడంతో పాటు, వారు సరఫరా చేసిన పాలకు సంబంధించిన బిల్లులను ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో వినియోగించే పాలు మరియు పాల ఉత్పత్తులను విజయ డైరీ నుంచే కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వీర్లపల్లి శంకర్ గారు కోరారు. గతంలో ప్రైవేట్ డైరీలను ప్రోత్సహించడం వల్ల విజయ డైరీ ఇబ్బందులను ఎదుర్కొన్న పరిస్థితి ఏర్పడిందని, ఇకపై ప్రభుత్వ సంస్థ అయిన విజయ డైరీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. షాద్ నగర్ నియోజకవర్గంలోని కంసాన్‌పల్లిలో ఉన్న ఫ్రోజెన్ సెమెన్ బుల్ స్టేషన్‌ను అతి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలనిప్రభుత్వాన్ని కోరారు.

భూ బకాసురుల నుండి మా భూమిని కాపాడండి

యాచారం సెప్టెంబర్ 11 ప్రభాతవార్త

నిరుపేద రైతుల భూములలో హద్దు రాళ్లు పాతి కంచేవేసిన దృశ్యం

పేదల భూములను డబ్బు మార్బలంతో అన్యాయంగా లాక్కుంటున్న భూబకాసురుల నుండి తమకు న్యాయం చేయాలని రైతులు మానవ హక్కుల కమిషన్, దళిత గిరిజన కమిషన్‌ను ఆశ్రయించిన సంఘటన నల్లవెల్లి తండాలో చోటుచేసుకుంది. స్థానికులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం యాచారం మండల పరిధిలోని నల్లవెల్లి తండా లో సర్వేనెంబర్ 3,4,5,45 లోని 50 ఎకరాలకు సంబంధించిన భూములు భూస్వాములైన మోహన్ రావు పోలీసు పలుకుబడితో తమకు సంబంధించిన భూమిలో అన్యాయంగా హద్దు కడీలు ముళ్ళకంచే ఏర్పాటు చేస్తూ తమకు తెలియకుండానే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అతి తక్కువ ధరలకు భూములను విక్రయించి రైతులను కొన్నది కొంచెం ఆన్లైన్లో ఎక్కించుకున్నది అధికమని ఆరోపిస్తున్నారు. ధన బలం పోలీసుల బలం అన్ని కలిగినా ఆయన నిరుపేదలైన 20 మంది రైతుల భూములను ఇష్టానుసారంగా ఆక్రమించుకుంటున్నారని తమ గోడు ఎవరికి చెప్పుకున్న వినే నాధుడు కరువైనాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పరిష్కరించాలని ఇబ్రహీంపట్నం రెవెన్యూ అధికారులైన గతంలో ఉన్న ఆర్డీవో అనంతరెడ్డి, ప్రస్తుతం ఉన్న ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డిలను పదేపదే కలిసిన సమస్య పరిష్కారం కావడం లేదని అధికారులందరూ పోలీసులు కూడా మోహన్ రావుకే మద్దతుగా ఉన్నారని ఆరోపించారు. తమ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఎస్సీ ఎస్టీ కమిషన్ను కలిసామని, మానవ హక్కుల కమిషన్ కలిసామని తమ సమస్య పరిష్కరిస్తుందని భావిస్తున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. గత సంవత్సర కాలంగా సమస్య కొనసాగుతుందని ఈ అధికారి దగ్గరికి వెళ్లి చూద్దాం పరిశీలన జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కూడా తూతూ మంత్రంగా సమస్య పరిష్కారం కోసం పనిచేస్తున్నారని మోహన్ రావు కనుకూలంగానే వారి పనితీరు ఉందని తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తమపై కేసులు పెట్టడం లేదని కేవలం నోటీసుల దారిని బెదిస్తున్నారని అన్నారు. మారుమూల ప్రాంతమైన గిరిజనులకు పోలీసుల బెదిరింపులు అధికమై తీవ్ర మనస్థాపాన్ని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బాధిత రైతులు రమావత్ రమేష్, సభావర్కర్ నరేష్ నాయక్, లాల్ సింగ్ నాయక్, సభావత్ చందు, సభావత్ భీమ్లాల్, సబవత్ వంతు, సభవత్ శంకర్, సభావత్ పంతు, రమావత్ మంత్, రమావత్ గాన్సిరాం, రమావత్ భాస్కర్, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బైక్ నడిపిన 15 మంది మైనర్లపై కేసు నమోదు

వికారాబాద్, ప్రభాతవార్తః ద్విచక్ర వాహనాలు నడిపిన 15 మంది మైనర్ బాలల పై కేసు నమోదు చేసిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రతి నిత్యం మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్లు పోలీసుల దృష్టికి రావడంతో, శుక్రవారం పట్టణ పరిధిలో పలు కూడళ్ళ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడిపిన 15 మంది మైనర్ బాలుర పై కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుకుమార్ తెలిపారు. ఇక మీదట మైనర్ బాలురు ద్వి చక్ర వాహనాలు నడిపినట్లు తమ దృష్టికి వస్తే వారి తల్లిదండ్రు లపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ

శంషాబాద్ సెప్టెంబరు 11,ప్రభాతవార్త : విద్యార్థులు బాగా చదవి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్కుడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 577 మంది విద్యార్థులకు సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ చేతుల మీదుగా యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలస్వామి, వార్డు సభ్యులు చౌట రాజు, నాయకులు తొంట అశోక్, లింగం నవీన్, కుంచ రక్షిత్, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సమాఖ్య అధ్యక్షులు బాబు రావు, జువీలు యాదమ్మ, లావణ్య, వాణి ,తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతికి హాని చేయకుండా గణేష్ ఉత్సవాలు

శంషాబాద్ సెప్టెంబరు 11,ప్రభాతవార్త : భక్తికి భంగం కలగకుండా.. ప్రకృతికి హాని చేయకుండా గణేష్ ఉత్సవాలను జరుపుకుందామని పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ పేర్కొన్నారు. శుక్రవారం పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తూ శంషాబాద్‌లో పర్యావరణహిత గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు. శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ, డిప్యూటీ కమిషనర్ బి. సుమన్ రావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రీన్ ఎర్త్ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధి నాగరాజ్ యాదవ్ సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ చంద్రకళ..మాట్లాడుతూ వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారైన విగ్రహాలకు బదులుగా మట్టి, పర్యావరణహిత విగ్రహాలను వినియోగించాలని సూచించారు. నిమజ్జనం సమయంలో నీటి కాలుష్యాన్ని నివారించేందుకు పర్యావరణహిత విధానాలను పాటించాలని కోరారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. పర్యావరణంపై అవగాహన కల్పించేలా కార్యక్రమం నిర్వహించిన నాగరాజ్ యాదవ్‌ను అధికారులు అభినందించారు.

వరుణదేవుడి కరుణ కోసం రైతుల ఎదురుచూపులు

-వర్షాలు లేక పంటలు ఎండిపోతూ.. కష్టాల్లో అన్నదాతలు

కేశంపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త: వరుణదేవుడు కరుణించకపోవడంతో కేశంపేట మండలంలోని పలు గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ రంగారెడ్డి జిల్లా సాంస్కృతిక విభాగం కోకన్వీనర్ కర్రెద్ల నరేందర్ రెడ్డి అన్నారు. సరైన సమయంలో వర్షాలు కురవక పోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని, పెట్టుబడులు పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలకు నీరందక రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం రైతుల పరిస్థితిని పరిశీలించి, పంటల నష్టాన్ని అంచనా వేసి తగిన సహాయం అందించాలని నరేందర్ రెడ్డి కోరారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం తీసుకొచ్చిన సఫల్ బీమా యోజన సమర్థవంతంగా అమలు చేసి ఉంటే పంట నష్టం సమయంలో రైతులకు ఆర్థిక భరోసా లభించేదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల ఆవేదన అర్థం చేసుకొనెల తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వరుణదేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించి రైతుల కష్టాలు తీర్చాలని ఆకాంక్షించారు.

గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై పరిశీలన

యాచారం, సెప్టెంబర్ 11,ప్రభాతవార్త యాచారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ శుక్రవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేసి నిధులు వినియోగంపై పరిశీలన చేశారు. గ్రామపంచాయతీ ద్వారా సేకరించనిధులు వినియోగం గతంలో ఎస్ టి ఓ లో జమ చేసి ఎస్ టి ఓ ద్వారా తిరిగి పొందేవారని నేడు కొత్త వీధి విధానాలతో నేరుగా జమ చేసిన నిధులను ఖర్చు చేయడానికే అవకాశం ఉందని అందుకు సంబంధిత అధికారులతో వెబ్సైట్లో పరిశీలన చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక అధికారి నాగేశ్వరరావు, డిపివో సురేష్ మోహన్, డి ఎల్ పి ఓ సాధన, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, లతా రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పోలీసుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి

గన్‌ఫౌండ్రి సెప్టెంబర్ 11ప్రభాతవార్త : విధినిర్వహణలో ఉండే పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అబిడ్స్ డివిజన్ ఏసిపి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు ప్రవీణ్‌కుమార్ అన్నారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన సిఐ పరుశురాంతో కలిసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో పోలీసులకు కేర్ ఆసుపత్రి వైద్యబృందం బిపి, డయాబెటిస్, ఈసిజీ, 2డీ ఎకో, బోన్‌డెన్సిటి, పరీక్షలతోపాటు ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించారు. సిబ్బందికి తగిన వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు తమ ఉద్యోగ నిర్వాణతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

హ్యాకథాన్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదును

కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తార్నాక, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : హ్యాకథాన్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలు, ప్రతిభను వెలికితీసి, సమస్యలకు వినూత్న పరిష్కారాలు కనుగొనే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (హెచ్‌ఎస్‌బీ) ఆధ్వర్యంలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్‌ఐహెచ్) ఇంటర్నల్ హ్యాకథాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, ఆచరణాత్మక పరిష్కారాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి నీతి ఆయోగ్ మెంటర్ ఆఫ్ చేంజ్ మనోజ్ కుమార్ బడగర్‌వాలా, డీప్‌లూప్ టెక్నాలజీస్ సీఈఓ, వ్యవస్థాపకుడు సూర్య ప్రకాశ్ జ్యూరీ సభ్యులు, మెంటర్లుగా హాజరై విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు. ప్రాజెక్టులపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వాన్ని అందించారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రిన్సిపాల్ డా. శ్రీదేవి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలు, విమర్శనాత్మక ఆలోచనా విధానం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని వాస్తవ ప్రపంచ సమస్యలకు అన్వయించేందుకు హ్యాకథాన్‌లు చక్కటి వేదికగా నిలుస్తాయని హెడ్-డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ జయశ్రీ పేర్కొన్నారు. హ్యాకథాన్‌లో మొత్తం ఆరు బృందాలకు చెందిన 36 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ సామాజిక, సాంకేతిక సమస్యలను గుర్తించిన విద్యార్థులు వాటికి వినూత్నమైన, ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందించి జ్యూరీ సభ్యుల ముందు ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సమస్య పరిష్కార నైపుణ్యాలతో పాటు బృంద స్ఫూర్తి, కమ్యూనికేషన్, ప్రదర్శనా నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచనా విధానం అభివృద్ధి చెందుతాయని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు వాస్తవ ప్రపంచ సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు రూపొందించేలా ప్రోత్సహించేందుకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని తెలిపారు.

సర్వకార్యేషు విఘ్ననాయకుడు వినాయకుడు

నాట్యగురువు డా. నిర్మలా విశ్వేశ్వరరావుకు ఘనంగా గురువందనం కావిస్తున్న దామోదర్‌గుప్తా, రమణారావు, దైవజ్ఞశర్మ తదితర గురువులు

రవీంద్రభారతి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త : మన భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆధ్యాత్మికతలో ప్రతీ కార్యంలో ముందుగా పూజలు చేసేది, పూజలందుకునే దేవుడు వినాయకుడని, ఆయన్ను పూజించనిదే ఏవిధమైన కార్యక్రమాలే కాకుండా పూజాకార్యక్రమాలు ప్రారంభించమని, వినాయకుడిని కొలుస్తే విఘ్నాలు కలుగవని, విజయవంతం అవుతాయని హిందువులంతా నమ్ముతారని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. అలాగే మన సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత గురువుకు దేవుని స్థానం ఇస్తామని, గురువులేనిదే సమాజం లేదు, అభ్యున్నతి, మనుగడేలేదని, ప్రపంచంలో ఎంత అత్యున్నతస్థాయిలో ఉన్నా అందుకు మూలం, మూల పురుషుడు గురువేనని ఆయన స్పష్టం చేశారు. ఎంతటి వారైనా తన గురువులను మరువకూడదని, గురువును మరిచినవాడు మనిషేకాదన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థలు జైజవాన్ జైకిసాన్ జైకళాకార్, గ్లోబల్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో అంగరంగ వైభవంగా జరిగిన గురువందనం, ఆధ్యాత్మికశోభను గుభాళింపజేసిన వినాయక చవితి వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోలేటి దామోదర్‌గుప్తా విశిష్ట అతిథులు సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు, పలువురు గురువులు తదితరులతో 10మంది సంగీత నృత్యగురువులను ఘనంగా సత్కరించి గురువందనం కావించారు. ఈ సందర్భంగా కళాకారులు వినాయకుడిని స్తుతిస్తూ చేసిన నృత్యప్రదర్శనలు ఆహుతులను భక్తిమార్గంలో పయనింపజేసి ఆధ్యాత్మికలోకంలో విహరింపజేశాయి. చివరిగా ఆయా ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులను బహూకరించారు.

అమవాస్య రోజు విధిగా పనులు బంద్ చేయాలి

జైశ్రీరామ్ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సంక్షేమ సంఘం అధ్యక్షులు జాహేద్ షరీఫ్.

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త : అమవాస్యరోజున విధిగా కార్మికులు పనులు బంద్ చేయాలని గాయిత్రినగర్ డివిజన్ జైశ్రీరామ్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు టీవీ శేషారావు అన్నారు. శుక్రవారం అమవాస్య సందర్భంగా గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ మైసమ్మ గుడి దగ్గర నూతనంగా ఏర్పాటు చేసిన జైశ్రీరామ్ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయాన్ని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాహేద్ షరీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాణ సంఘం అధ్యక్షులు టీవీ శేషరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. జోనల్ పరిధిలో కార్మికులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. లేబర్ కమిషనర్ నుంచి ఇన్సూరెన్స్ డబ్బులు పొందేవరకు కమిషనర్ ద్వారానే డబ్బులు అందేలా చూడాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కార్మికులకు రూ.6 లక్షలు ఇస్తున్నారని దానిని రూ.10 లక్షలకు పెంచాలని పేర్కొన్నారు. లేబర్ కార్మికుల పెళ్లికి రూ.60 వేలు ఇస్తున్నారని వాటిని రూ.లక్ష వరకు పెంచాలని అన్నారు. అదేవిధంగా ఇద్దరు పిల్లలు ఉన్నవారికి రూ.30 వేలు ఇస్తున్నారని వాటిని రూ.60 వేల వరకు పెంచాలని కోరారు. అనంతరం స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వెంకటేష్ మాట్లాడుతూ అడ్డామీద మహిళా కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని వారికి తగిన రక్షణ కల్పించాలని అందుబాటులో ఉండే విధంగా ప్రజా మూత్రశాళలు వేర్పాటు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం తరపున శాశ్విత కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు నవ్వులూరి రోషయ్య, హనుమంతు, కొండల్‌రావు, భాస్కర్‌రావు, రమాకాంత్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా

- డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామ ఇంద్రపాల్ రెడ్డి

అత్తాపూర్ సెప్టెంబరు 11,ప్రభాతవార్త : హైదర్‌గూడ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టంగా తీర్చిదిద్ది, ప్రతి బూత్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామ ఇంద్రపాల్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువచ్చి రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని దీమా వ్యక్తం చేశారు. హైదర్‌గూడ డివిజన్ అధ్యక్షుడిగా ఇంద్రపాల్ రెడ్డి ఎన్నికైన సందర్భంగా శుక్రవారం రాష్ట్ర టిపిసిసి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ,స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేతుల మీదుగా ఇంద్రపాల్ రెడ్డి నియమాక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ,ఎమ్మెల్యే మాట్లాడుతూ.. .కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీకి మరింత ప్రజాదరణ తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంద్రపాల్ రెడ్డి మాట్లాడుతూ... అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టేందుకు సహకారం అందించిన ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్. తదితరులకు కృతజ్ఞలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. హైదర్‌గూడ డివిజన్‌లో కాంగ్రెస్‌కు మరింత బలమైన ప్రజా మద్దతు సాధించే దిశగా కార్యకర్తలతో కలిసి సమన్వయంతో ముందుకు సాగుతామని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి కృషి-ప్రజల ఆశీర్వాదంతో హైదర్‌గూడలో కాంగ్రెస్‌ను మరింత బలమైన శక్తిగా నిలబెడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

మట్టితోనే వినాయకుడి మనసుకు సంతృప్తి : హెచ్‌ఎం ఉదయశ్రీ

మేడిపల్లి ఉన్నత పాఠశాలలో మట్టి వినాయకులతో ఉపాధ్యాయులు విద్యార్థులు

యాచారం,సెప్టెంబర్, 11 ప్రభాతవార్త.. యాచారం మండల పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులు 50 కుపైగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని శుక్రవారం చాటిచెప్పారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వయంగా మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకున్నారు. మట్టి గణపతి విగ్రహాలను విద్యార్థులు తయారు చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి నక్కర్త ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఉదయశ్రీ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మట్టి గణపతిని పూజిద్దాం. ఇది మన సంప్రదాయానికి, ప్రకృతికి ఎంతో మంచిది అని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రసాయన రంగుల విగ్రహాల వల్ల నీరు కలుషితమవుతుంది. మట్టి విగ్రహాలు నీటిలో త్వరగా కరిగిపోతాయి. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ కోసం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో తయారయ్యే విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని వినాయక చవితి సందర్భంగా విద్యార్థులకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు ముందుండాలని, చిన్ననాటి నుంచే ప్రకృతిని కాపాడే బాధ్యతను అలవర్చుకోవాలని రాకేష్ సూచించారు. అనంతరం చక్కగా గణపతి విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.రవీందర్, వేణుగోపాల రెడ్డి, కిషన్ నాయక్, రాంమోహన్, యాదయ్య, జ్యోత్స్న హిప్సిబా, శ్రీకాంత్, రమేష్ , మల్లేష్ , గిరిజరాణి, విజయ, యాదయ్య, పి ఆర్ జి ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త తదితరులు ఉన్నారు

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

గండిపేట మండల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

నార్సింగి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : విద్యాలయాలలో నవ భారత నిర్మాణదారులను తయారు చేస్తున్న ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో ఉత్తమ ఉపాధ్యాయులందరిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత మన ఎదుగుదలకు నిస్వార్థంగా కృషి చేసే ఏకైక మనిషి ఉపాధ్యాయుడని కొనియాడారు. ఉపాధ్యాయులు చూపిన మార్గంలో నడిచిన వాళ్లు ఎంచుకున్న రంగంలో శిఖరాగ్రాలకు చేరారని వివరించారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, పెద్దల పట్ల గౌరవభావం వంటివి ఒంటబట్టించడంలో గురువును మించిన వారు లేరన్నారు. చదువు ఒక్కటే మనలను ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానంకు తీసుకెళ్తుందన్నారు. తల్లిదండ్రులు ప్రతీ ఒక్కరూ తమ బిడ్డలను కచ్చితంగా బడులకు పంపించాలని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాశాఖకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారని, నేడు సర్కారు బడుల్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అన్నీ అందజేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ దాని శివారుల్లోని సర్కారు బడుల్లో కార్పోరేట్ విద్యాలయాలకు ధీటుగా విద్యా బోధన అందుతుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం తనకు చాలా గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో పలువురు రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైస్తవ మైనారిటీలకు రాజకీయంగా సమాన అవకాశాలు ఇవ్వాలి

ప్రసంగిస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గోనె సోలమన్ రాజ్,

చిక్కడపల్లి సెప్టెంబర్ 11, ప్రభాతవార్త : రాష్ట్రంలోని ప్రొటెస్టెంట్, కాథలిక్ క్రైస్తవ మైనారిటీలకు తక్షణమే రాజకీయ న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సోలమన్ రాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ పి. మెన్నో జోయల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణగూడ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో క్రైస్తవ సమాజం ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓబీసీ, ఓసీ వంటి అన్ని సామాజిక వర్గాలలో విస్తరించి, జనాభాలో కీలక భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో క్రైస్తవులు అత్యంత కీలక పాత్ర పోషించినప్పటికీ, ప్రభుత్వంలోనూ, పార్టీ నాయకత్వంలోనూ తగిన ప్రాతినిధ్యం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్ణయాత్మక పదవుల్లో ప్రాతినిధ్యం లభించినప్పుడే సమగ్ర పాలన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రతి నెలా పాస్టర్లకు నిర్ణీత గౌరవ వేతనాన్ని అమలు చేయాలి. స్మశాన వాటికలు: రాష్ట్రంలోని అన్ని మండలాల్లో క్రైస్తవ స్మశాన వాటికల కొరకు స్థలాలను కేటాయించాలి. సమాజంలో విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా సమగ్ర బిల్లును ప్రవేశపెట్టాలి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రైస్తవ నాయకుడిని నియమించాలి. గతంలో చేజారిన ఎమ్మెల్సీ సీటును క్రైస్తవులకు కేటాయించాలి. క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలి. మైనారిటీ కమిషన్ వైస్ చైర్మన్‌గా క్రైస్తవ ప్రతినిధిని నియమించాలి. ప్రభుత్వంలోని వివిధ శాఖల బోర్డులలో కమ్యూనిటీ ప్రతినిధులను డైరెక్టర్లుగా నియమించాలి. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో క్రైస్తవ కోఆప్షన్ సభ్యులను నియమించాలి. మార్కెట్ కమిటీలలో చైర్మన్ సభ్యుల పదవులు కేటాయించాలి. డీసీసీ పదవులు: జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి డీసీసీ పదవులలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలి. నామినేటెడ్ పదవులతో పాటు, క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చడం సామాజికఆర్థిక సంక్షేమ పథకాలను క్రమబద్ధీకరించడంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. రాష్ట్ర అగ్ర నాయకత్వం త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కమిటీ సభ్యులు సి. బెనోని రిచర్డ్, పాస్టర్ జయకుమార్, పాస్టర్ చిట్టిబాబు, బి. ప్రేమ్ సాగర్, సి. హేమలత, ఎం. శాలిని, ఐ. నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ భీష్ముడు విశ్వనాథ సత్యనారాయణ

: హాస్యావధాని శంకరనారాయణ

ప్రసంగిస్తున్న ప్రముఖ హాస్యావధాని, జర్నలిస్ట్ శంకరనారాయణ

చిక్కడపల్లి సెప్టెంబరు 11, ప్రభాతవార్త : ఆధునిక తెలుగు సాహితీ జగత్తులో విశ్వనాథ సత్యనారాయణ ఒక వెలుగురేఖ అని ప్రముఖ హాస్యావధాని, జర్నలిస్ట్ శంకరనారాయణ కొనియాడారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికపై "గానసభ నిర్వహణలో, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో "ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ యాదిలో సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శంకరనారాయణ మాట్లాడుతూ విశ్వనాథ సత్యనారాయణ సాహితీ భీష్ముడని, ఆయన చేపట్టని తెలుగు సాహితీ ప్రక్రియే లేదని అన్నారు. విశ్వనాథ రచించిన "వేయిపడగలు బృహత్ నవలను నాడు భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు హిందీలో సహస్రఫణ్ పేరిట అనువదించి, ఆ గ్రంథానికి జాతీయ స్థాయిలో సముచిత స్థానం కల్పించారని గుర్తుచేశారు. తెలుగు సాహిత్యంలో జ్ఞానపీఠ్ అవార్డు పొందిన ముగ్గురు ప్రముఖుల్లో విశ్వనాథ సత్యనారాయణ ప్రథములు అని తెలిపారు. సమావేశంలో ప్రముఖ గాయకుడు భూపతి కృష్ణకుమార్, గాయని రాధారాణి, మల్లెల వసుంధర పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే పూజించాలి

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో మట్టివినాయకులను పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్

చిక్కడపల్లి సెప్టెంబర్ 11 ప్రభాతవార్త : పర్యావరణానికి ఎటువంటి హాని కలిగించని మట్టి వినాయక విగ్రహాలనే పూజించి ప్రకృతులని కాపాడుకోవాలని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. అంజన్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పర్యావరణ పరిరక్షణ ప్రచారంలో భాగంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో భక్తులకు ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంజన్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, భక్తులకు మట్టి విగ్రహాలను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమై పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మట్టి ప్రతిమలను వినియోగించి పండుగను పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శీలం సత్యనారాయణ, మారిశెట్టి నరసింగరావు, బండారి నవీన్, గుర్రం శంకర్, భానుచందర్, గుర్రం దినేష్, నరేందర్ యాదవ్, అభిషేక్ కెన్నెడీ, జయేందర్ బాబు, యాదగిరి గౌడ్, జగదీష్, రాజేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోలాల అమావాస్య సందర్భంగా ఛత్రినాక కూడలిలో పేదలకు అన్నదానం చేస్తున్న లాల్‌దర్వాజా, గౌలిపురా ఆర్యవైశ్య సంఘం, వాసవి అన్నపూర్ణ సేవా సంస్థ ప్రతినిధులు

పార్టీ సిద్ధాంతాలను పక్కనపెట్టి చేరికలు చేయడం సరికాదు

-నిఖార్సయిన కార్యకర్తలకు అన్యాయం చేయొద్దు : బిఆర్‌ఎస్ నేతలు

కేశంపేట, సెప్టెంబరు 11 ప్రభాతవార్త: కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు ఉమాపతి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కొత్త శ్రీశైలంను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకోవడంపై గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలకు ఒక విధానం, పార్టీ వ్యవస్థ ఉంటుందని, గ్రామ కమిటీ అధ్యక్షుడు, మండల అధ్యక్షుడు తదితర బాధ్యతల్లో ఉన్న నాయకులను సంప్రదించకుండా సొంత నిర్ణయాలతో చేరికలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా నిబద్ధతతో పనిచేస్తున్న నిఖార్సయిన కార్యకర్తల మనోభావాలను గౌరవించాలని కోరారు. పార్టీకి ద్రోహం చేసిన వారిని, రాజకీయంగా తరచూ వైఖరి మార్చుకునే నాయకులను కేవలం వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలోకి తీసుకురావడం వల్ల నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని వారు అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణ, స్థానిక నాయకత్వ వ్యవస్థను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపైనా ఉందని స్పష్టం చేశారు. ఎవరినీ లెక్కచేయకుండా సొంత నిర్ణయాలతో చేరికలు చేసుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తల్లో అసంతృప్తి ఏర్పడుతుందని, ఇలాంటి నిర్ణయాలను పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ పలాటి సురేందర్, మండల యూత్ అధ్యక్షులు తోట వెంకటేష్, వార్డు సభ్యులు చందు, వడ్ల జంగాచారి, బండ నిరంజన్, పట్నం మహేందర్, శ్రీను, రాములు, శంకర్ నాయక్, నారాయణరెడ్డి, మహాలింగం, కొత్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో వ్యక్తి దారుణ హత్య

గచ్చిబౌలి, సెప్టెంబరు 11 ప్రభాతవార్త గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో దారుణం చోటుచేసుకుంది. ఒడిస్సా నుంచి నగరానికి వచ్చిన వలస కూలీల మధ్య జరిగిన వివాదం హత్యకు దారి తీసింది. ఒడిస్సా నుంచి నగరానికి వచ్చి హాస్టల్‌లో పనిచేస్తున్న వ్యక్తిని మరో హాస్టల్‌లో పనిచేస్తున్న వ్యక్తి కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...ఒడిస్సా రాష్ట్రానికి చెందిన శశిధర్ రాజ్(44) బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గచ్చిబౌలి అంజయ్యనగర్‌తో తన భార్య(38)తో కలిసి నివాసం ఉంటున్నాడు. భార్య, భర్తలు ఇద్దరు అంజయ్యనగర్‌లోని హరిహర మెన్స్ హాస్టల్‌లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. కాగా శశిధర్ రాజ్‌కు ఒడిస్సాకే చెందిన ప్రమోద్‌కుమార్‌తో పాత పరిచయం ఉంది. గతంలో వీరంతా ఒకే చోట పనిచేసిన వారు కాగా, ఇద్దరి మధ్య ఏర్పడిన విభేదాలతో శశిధర్ రాజ్, ప్రమోద్‌కుమార్‌లు గతకొంత కాలంగా మాట్లాడుకోవడం లేదు. ఇదే క్రమంలో రెండు నెలల క్రితం శశిధర్ రాజ్ తన భార్యతో కలిసి అంజయ్యనగర్‌కు వచ్చాడు. కాగా ఈ మధ్యే ప్రమోద్‌కుమార్ సైతం గచ్చిబౌలికి వచ్చి అంజయ్యనగర్‌లోనే ఉన్న శివ బాలాజీ హాస్టల్‌లో వంట మనిషిగా ఐదు రోజుల క్రితం చేరాడు. ఈ రెండు హాస్టళ్లు పక్కపక్కనే ఉండడం, ఇద్దరి మధ్య మాటలు లేకపోవడంతో తరచూ వివాదం కొనసాగుతుంది. కాగా శుక్రవారం రాత్రి 10.45 గంటల ప్రాంతంలో హాస్టల్ బయట ఉన్న శశిధర్ రాజ్ మీద ప్రమోద్‌కుమార్ ఒక్కసారిగా దాడి చేశాడు. తన వెంట తెచ్చుకున్న కూరగాయలు కోసే కత్తితో శశిధర్ రాజ్‌ను పొడిచి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనలో తీవ్ర కత్తిపోట్లతో రక్తస్రావం జరిగి శశిధర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ హత్య దృశ్యాలు స్థానికంగా ఉన్న సిసి కెమెరాలో నమోదయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు మృతుడి భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మట్టి వినాయకుడినే పూజించాలి..

-హెచ్ఎం ఉదయశ్రీ

యాచారం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

యాచారం మండల పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 50 కుపైగా మట్టి గణపతి విగ్రహాలను తయారు చేసి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని శుక్రవారం చాటిచెప్పారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వయంగా మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకున్నారు. మట్టి గణపతి విగ్రహాలను విద్యార్థులు తయారుచేశారు. ఈసందర్భంగా మేడిపల్లి నక్కర్త ప్రభుత్వపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉదయశ్రీ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మట్టి గణపతిని పూజిద్దాం. ఇది మన సంప్రదాయానికి, ప్రకృతికి ఎంతో మంచిదని అన్నారు. అనంతరం చక్కగా గణపతి విగ్రహాలను తయారుచేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.రవీందర్, వేణుగోపాలరెడ్డి, కిషన్ నాయక్, రాంమోహన్, యాదయ్య, జ్యోత్స్న హిప్సిబా,శ్రీకాంత్, రమేష్, మల్లేష్, గిరిజరాణి, విజయ, యాదయ్య, పిఆర్‌జి ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరి రవీందర్‌గుప్త తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలి

యాచారం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని ముదిరాజ్‌సంఘాలు చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడికార్యక్రమం నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా యాచారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నీలం శ్రీకాంత్ ముదిరాజ్, మండల ప్రధాన కార్యదర్శి, కానేమోని గణేష్, ఉపాధ్యక్షులు యారా అశోక్‌లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చలో అసెంబ్లీ కార్యక్రమానికి ముదిరాజ్ సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఉదయమే పోలీసులు తన ఇంటికి వచ్చి ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉందని, ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయడం ప్రభుత్వబాధ్యత అని పేర్కొన్నారు. ముదిరాజ్‌ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరిత గతిన పరిష్కరించాలని కోరారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాన్ని అడ్డుకోవడం కాకుండా ముదిరాజ్‌ల సమస్యలపై ప్రభుత్వం చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

13 మంది ఉపాధ్యాయులకు ఘన సత్కారం

దుద్యాల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

దుద్యాల్ ఎంఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి విశిష్ట సేవలందిస్తున్న 13మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయుల కృషి, అంకితభావం విద్యావ్యవస్థకు బలమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్, కాంప్లెక్స్ హెచ్ఎం మల్లప్ప, ఎంపిడివో జైపాల్‌రెడ్డి పాల్గొని ఉపాధ్యాయులను అభినందించారు.

ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తాం

పెద్దేముల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

పెద్దేముల్ మండలం మంబాపూర్ శ్రీహనుమాన్ ఆలయ కమిటి చైర్మెన్‌గా వరప్రసాద్‌గౌడ్, డైరెక్టర్లుగా ఆర్.నర్సిములు, వడ్ల రాములు, టి.విజయ కుమార్, అనితలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీగోపాలక్రిష్ణ ఆలయకమిటి చైర్మెన్‌గా ముదిని రాములు, డైరెక్టర్లుగా తలారి రాములు, రాజవర్ధన్‌రెడ్డి, సి.నారాయన్‌రెడ్డి, ఎంగూరి లక్ష్మిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీల అధ్యక్షుల, సభ్యుల చేత ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్. ప్రణీత్, ఏఓ ప్రవీన్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీల చైర్మెన్లు వరప్రసాద్‌గౌడ్, ముదిని రాములు మాట్లాడుతూ తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి సహాయ సహకారంతో ఆలయాల అభివృద్ధి కోసం తమవంతు కృషిచేస్తామని అన్నారు. తమకు మరోసారి ఆలయ కమిటీల చైర్మెన్లుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్‌కమిటి వైస్‌చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, వార్డుమెంబర్ తెరువటి నర్సిములు, గ్రామస్థులు హర్షవర్ధన్‌రెడ్డి, తాడి అంజిలయ్య,చాపల వెంకటయ్య, సంగెం చంద్రప్ప, టిల్లు, కుమ్మరి నర్సిములు, బంటారం భీములు, పూజారి ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ క్యాంటిన్‌లో రూ.5కే రుచికరమైన భోజనం

-మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్

ఇందిరమ్మ క్యాంటిన్‌లో భోజనంచేస్తున్న కడా ప్రత్యేక అధికారి, మున్సిపల్ చైర్మన్ తదితరులు

కొడంగల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

కొడంగల్ పట్టణ కేంద్రానికి నిత్యం వచ్చి వెళ్ళే నిరుపేదలు,రోగులు,వారి సహాయకుల ఆకలి తీర్చేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ క్యాంటిన్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది.కేవలం రూ.5కే అందిస్తున్న భోజనం రుచికరంగా ఉండడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. హరేక్రిష్ణ ఫౌండేషన్ అధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన ఇందిరమ్మ క్యాంటిన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.రూ.5కే ఉదయం అందిస్తున్న టిఫిన్,మధ్యాహ్నం రూ.5కే అందిస్తున్న భోజనం నిరుపేదల ఆకలి తీరుస్తుంది.ఈ క్రమంలో శుక్రవారం మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్,కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్,మున్సిపల్ వైస్ చైర్మేన్ శంకర్‌నాయక్,స్థానిక ఎస్సై ఈవీ.సత్యనారాయణ తదితరులు ఇందిరమ్మ క్యాంటిన్‌ను సందర్శించి భోజనం చేశారు.భోజనం రుచిని పరిశీలించిన వారు రూ.5కే రుచికరమైన భోజనం అందించడం అభినందనీయంటూ సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటుచేసిన ఇందిరమ్మ క్యాంటిన్ భోజనం ఎంతోబాగుందని కితాబిచ్చారు. క్యాంటిన్‌లో అందిస్తున్న మెనూ.భోజన ఏర్పాట్లు తదితర అంశాలపై నిర్వహకులను వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రికి వచ్చే రోగులు,వారి సహాయకులకు ఎంతో ప్రయోజనం కలుగుతోందన్నారు.

కొనసాగుతున్న కనకం గుంతల పూడ్చివేత పనులు

కొడంగల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

మండలపరిధిలోని పర్సాపూర్‌లో కనకం గుంతల పూడ్చివేత పనులు వేగంగా కొనసాగుతున్నాయి.పనుల పురోగతిని శుక్రవారం గ్రామసర్పంచ్ రాధాశ్రీనివాస్‌రెడ్డి,మాజీ సర్పంచ్ కన్నం శ్రీనివాస్‌రెడ్డి,కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాములు,పట్టణ అధ్యక్షులు శ్రీశైలం,సూరి తదితరులు పరిశీలించి జరుగుతున్న పనులపై హర్షం వ్యక్తంచేశారు.పనులు ఏ విధంగా కొనసాగుతున్నాయో పరిశీలించడంతోపాటు పనులపురోగతిపై పంచాయతీరాజ్ ఏఈ సంపత్ సంభందిత వివరాలను నాయకులకు వివరించారు. పనులు శరవేగంగా కొనసాగుతుండడంపై నాయకులు గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.అభివృద్ధి పనులు కేవలం ప్రారంభించడం మాత్రమే కాకుండా వాటిని వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని నాయకులు తెలిపారు.

ఆధునిక వ్యవసాయపద్ధతుల ద్వారా అధికదిగుబడి

-ఆత్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

పూడూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

ఆధునిక వ్యవసాయ పద్దతుల ద్వారా అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఆత్మచైర్మన్ కక్కునూరు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని మంచన్‌పల్లి రైతువేదికలో రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యక్రమంలో సర్పంచ్ రాఘవేందర్, వ్యవసాయ సహాయ సంచాలకులు అరుణ, మండల వ్యవసాయ అధికారిణి రజిత, ఎఇఓలు, ఆత్మ బిటిఎం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి

-తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్
-మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షాసమావేశం
-ఫుడ్ సేఫ్టీ అధికారులు తరుచూ తనిఖీలు నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పాల్గొన్న కమిషన్ మెంబర్లు, జిల్లా అదనపు కలెక్టర్ల దృశ్యం

మేడ్చల్‌జిల్లాప్రతినిధి, సెప్టెంబరు11, ప్రభాతవార్త:

జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసేలా సంబంధిత అధికారులు కృషిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ ఆహారభద్రత చట్టం -2013 అమలుపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసమావేశంలో ఆయనతో పాటు కమిషన్ సభ్యులు ఒరగంటి ఆనంద్, జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్షాసమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రతాచట్టాన్ని 2017నుంచి రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తుందన్నారు. పౌష్టికాహారం పొందటం వారి హక్కు అని, వారి హక్కులకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. జిల్లాలో రేషన్ షాపులు, రెసిడెన్షియల్ స్కూల్స్, జిల్లా పరిషత్ స్కూల్స్, అంగన్‌వాడీకేంద్రాలలో ఏవిధమైన ఆహారాన్ని అందించటం జరుగుతుందో అని తనిఖీలు నిర్వహించామని, అందులో కొన్నిలోపాలను, సమస్యలను గుర్తించామన్నారు. గర్భిణులకు, 14సంవత్సరాలలోపు పిల్లలకు అందించే పౌష్టికాహారంలో కొంతనిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. వాటిపై సంబంధిత అధికారులు నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. వారి ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యంచేస్తే కమిషన్ తీవ్రమైన చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు. పిల్లల ఎదుగుదలకు అవసరమైన బాలామృతం, పౌష్టికాహారం అందించటంవల్ల ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటుచేసుకోవచ్చన్నారు. దమ్మాయిగూడ స్కూల్‌లో పరిశుభ్రత లేకుండా, సరైనరికార్డులు, హాజరుపట్టికలు లేకుండా, నిర్లక్ష్య ధోరణితో వ్యవరించిన హెడ్‌మాస్టర్, టీచర్లకు షోకాజ్ నోటీసులు అందించాలన్నారు. స్కూల్స్‌లో, అంగన్‌వాడి కేంద్రాల్లో సరఫరా చేస్తున్న గుడ్ల విషయంలో సంబంధిత కాంట్రాక్టర్లను హెచ్చరించారు. కిషోరబాలికలలో 50 శాతంమందికి రక్తహీనత ఉందన్నారు. వారికి పౌష్టికాహారంతో పాటు పాలు, పళ్లు అందించి రక్తహీనతను తగ్గించేలాచూడాలని ఆదేశించారు. మెనూప్రకారం భోజనం అందించటంలేదని, మెనూప్రకారం అందించేలా తగుచర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారిని ఆయన ఆదేశించారు. విద్య, వైద్య, మహిళా, శిశు సంక్షేమశాఖలు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంక్షేమశాఖాధికారులు పిల్లలకు అందించే భోజనం విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటూ నెలకొక సారి రెసిడెన్షియల్ స్కూల్స్, అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీలు నిర్వహించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడ తరుచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నివేదికలు పంపాలని, రికార్డులు నిర్వహించేలా చూడాలని చైర్మన్ గోలి శ్రీనివాస్ సూచించారు. ఎన్నికల, సర్వేలు, విధులు కేటాయించినపుడు అంగన్‌వాడి, ఆశావర్కర్లస్థానంలో ప్రత్యామ్నాయంగా ఇతరులను ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. మానవతాదృక్పథంతో బాధ్యతాయుతంగా భోజనంపెట్టి విధులు శ్రద్ధగా నిర్వహించాలని ఆయన సూచించారు. సమావేశంలో వారితోపాటు నోడల్‌అధికారి సాంబశివరావు, జిల్లా బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ అధికారులు ఝాన్సీరాణి, వినోద్‌కుమార్, పద్మజా, కాంతమ్మ, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్, సివిల్ సప్లై అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమాధికారి శారద, ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ నిధుల వినియోగాన్ని పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ వెస్లీ

యాచారం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

యాచారం మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ శుక్రవారం సందర్శించి రికార్డులు తనిఖీచేసి నిధులు వినియోగంపై పరిశీలనచేశారు. గ్రామపంచాయతీ ద్వారా సేకరించనిధులు వినియోగం గతంలో ఎస్‌టిఓలో జమచేసి ఎస్‌టిఓ ద్వారా తిరిగి పొందేవారని నేడు కొత్త విధివిధానాలతో నేరుగా జమచేసిన నిధులను ఖర్చు చేయడానికే అవకాశం ఉందని అందుకు సంబంధిత అధికారులతో వెబ్సైట్లో పరిశీలన చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంకేతిక అధికారి నాగేశ్వరరావు, డిపివో సురేష్‌మోహన్, డిఎల్‌పిఓ సాధన, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, లతారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కుదురుమల్లలో భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ

గ్రామసభలో పాల్గొన్న అధికారులు, రైతులు

దుద్యాల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

మక్తల్ నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలోని కుదురుమల్ల గ్రామంలో శుక్రవారం భూసేకరణకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని 42 మంది రైతులకు చెందిన 18.24 ఎకరాల భూమిని భూసేకరణ చేయనున్న నేపథ్యంలో రైతుల అభిప్రాయాలు, భూసేకరణ ప్రక్రియ, పరిహారం తదితర అంశాలపై చర్చించారు. తహసీల్దార్ కిషన్ మాట్లాడుతూ రైతులకు నిబంధనల ప్రకారం భూసేకరణ, పరిహారం ప్రక్రియను పారదర్శకంగా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో తాండూర్ ఆర్డీఓ అనిత, గిర్దావర్ నవీన్ కుమార్, సర్పంచ్ లాలప్ప, పంచాయతీ కార్యదర్శి రాధ, జీపీఓ గోపాల్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలు ఎంతో కీలకం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

విద్యార్థుల జీవితాల్లో క్రీడలు ఎంతోకీలకమని జిల్లెడుచౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు మారోజు ప్రకాశ్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో ఘనంగా ఎస్‌జీఎఫ్ క్రీడల ముగింపువేడుకలను నిర్వహించారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలు, రన్నరప్‌లకు బహుమతులను ముఖ్యఅతిథులు, ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు విద్యార్థులకు అందజేశారు. బహుమతులను జెడ్పీహెచ్ఎస్ చౌదర్‌గూడ పూర్వవిద్యార్థి శివ అందజేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, జెడ్పీహెచ్ఎస్ చౌదర్‌గూడ జీహెచ్ఎం సునీత, మండలంలోని ఆయా పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శిరీష, ఉపాధ్యాయ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోడీకి క్షీరాభిషేకం

ఘట్‌కేసర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్-ఖాజీపేట 4వ రైల్వేలైన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి పాలతో అభిషేకం నిర్వహించారు. ఘట్‌కేసర్ పట్టణంలో బిజెపిడివిజన్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతగా అంబేద్కర్‌విగ్రహం వద్ద పీఎం మోదీకి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ అభివృద్ధికి, రైల్వే మౌలిక వసతుల బలోపేతానికి రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రకేబినెట్ ఆమోదంతెలపడం హర్షణీయమని మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లానాయకులు కంభం లక్ష్మారెడ్డి, సగ్గు మోహన్‌రావు, డివిజన్ ఉపాధ్యక్షులు పడిదెం వీరేశం, ప్రధాన కార్యదర్శి మంగు రాధిక, కార్యదర్శి మడిపడిగే అంజయ్య, కిసాన్ మోర్చా కట్ట మధుసూదన్‌రెడ్డి, బూత్ అధ్యక్షులు మమతాశర్మ, రేఖ సోని, నాయకు లు మంగు శ్రీనివాస్‌రావులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటలపై రైతులకు అవగాహన

కొడంగల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

కొడంగల్ నియోజకవర్గ రైతులకు నారాయణపేట్ జిల్లాలో అయిల్‌పాం తోటలపై అవగాహనకల్పించినట్లు జిల్లా ఉద్యాన,పట్టుపరిశ్రమల అధికారి ఎం.ఎ.సత్తార్ తెలిపారు.నియోజకవర్గానికి చెందిన రైతులకు అయిల్‌పాం సాగుపై ప్రాయోగిక అవగాహన కల్పించేందుకు గాను శుక్రవారం నారాయణపేట్ జిల్లాలో ఎక్స్‌పోజర్ విజిట్(అవగాహన పర్యటన) నిర్వహించారు. రైతులు ప్రత్యక్షంగా తోటలను పరిశీలించడం ద్వారా ఆయిల్‌పామ్ సాగుపై మరింత అవగాహన పొందారు.

చదువుతోపాటు క్రీడలలో రాణించాలి

-మున్సిపల్ చైర్మన్ నేనావత్ పత్యానాయక్

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైర్మన్ పత్యానాయక్

ఆమనగల్లు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడమే కాకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకొని తమ ప్రతిభపాటవాలతో రాణించాలని ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ నేనావత్ పత్యానాయక్ అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్నేకాకుండా దేహధారుడ్యం, క్రమశిక్షణను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండల విద్యాధికారి పాండు అధ్యక్షతన 70వ ఎస్‌జిఎఫ్ క్రీడాపోటీలు నిర్వహించారు. అండర్ 14, అండర్ 17 విభాగాలలో బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించారు. చైర్మన్ పత్యానాయక్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రారంభోత్సవ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ చిన్నతనం నుండి క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టతలు సంపాదించాలని తెలిపారు. క్రీడలు, చదువులకు సమ ప్రాధాన్యతనిచ్చి రాణించాలని సూచించారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా పాఠశాలలనిర్వాహకులు, తల్లిదండ్రులు కృషిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముక్తాల వెంకటయ్య, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద పసుపునీళ్లతో శుద్ధిచేయడంపై నిరసన

మోమిన్‌పేట్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

దళిత సమాజానికి బీఆర్ఎస్ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలి. మాజీసీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌వద్దకు దళితులువచ్చారనే కారణంతో బీఆర్ఎస్ నాయకులు పసుపునీళ్లు చల్లి శుద్ధిచేయడాన్ని తెలంగాణ సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొనింటి సురేష్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఘటనను నిరసిస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో మాట్లాటుతు...ఈ సందర్భంగా తెలంగాణ సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొనింటి సురేష్ దళితులను చిన్నచూపుచూడటం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యసమాజంలో సరికాదన్నారు. ఇలాంటిచర్యలు సామాజిక సమానత్వానికి విరుద్ధమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కేటీఆర్, హరీష్‌రావు లను ఓడిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసభ్య పదజాలం ఉపయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కొనింటి సురేష్ తెలిపారు. ప్రజాప్రతినిధుల పట్ల ఇలాంటివ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. తక్షణమే బీఆర్ఎస్ నాయకులు దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన ఆందోళనలు, నిరసనలు చవిచూడాల్సి వస్తుందని కొనింటి సురేష్ సవాల్ చేశారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

-మేడ్చల్ బిజెపి కమిటీ డిమాండ్

మేడ్చల్, సెప్టెంబరు 11. ప్రభాతవార్త:

తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన, ప్రాధాన్యత కలిగిన సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ మేడ్చల్ కమిటీ డిమాండ్ చేసింది. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మేడ్చల్ బీజేపీ పార్టీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మేడ్చల్ తహసీల్దార్‌కు, మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాల పాటు సాగిన ప్రజా పోరాటాలు, అనేకమంది వీరుల త్యాగాలు, రైతులు, యువకులు, మహిళలు, సామాన్య ప్రజల ఉద్యమాల ఫలితంగానే తెలంగాణకు విముక్తి లభించిందని అన్నారు. తెలంగాణ విమోచన కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను మరవడం అంటే చరిత్రను విస్మరించినట్లేనని పేర్కొన్నారు. తెలంగాణ విమోచన పోరాటం కేవలం ఒక రాజకీయ అంశం కాదని, తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, విముక్తికి సంబంధించిన గొప్ప చారిత్రాత్మక ఉద్యమమని స్పష్టంచేశారు. అందువల్ల సెప్టెంబర్ 17ను కేవలం ఒక కార్యక్రమంగా పరిమితంచేయకుండా, తెలంగాణచరిత్రను గుర్తుచేసుకునే మహత్తరమైన సందర్భంగా రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17 సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, జిల్లా మరియు మండల కేంద్రాల్లో అధికారికంగా జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలం, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా బీజేపీ కోశాధికారి లవంగ శ్రీకాంత్, జిల్లా బీజెవైఎం అధ్యక్షుడు రాగం అర్జున్, నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, ధాత్రిక లక్ష్మణ్ వంజరి, కొండం ఆంజనేయులు ముదిరాజ్, పోచయ్య, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీ గుప్త, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమ దాసు, ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి ,దోసడి రామచంద్ర రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, మహిళా నాయకులు అనిత, మహేష్ గౌలికర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి చెరువును కాపాడాలని విజ్ఞప్తి

-హైడ్రా కమిషనర్ పరిశీలన

చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, నాయకులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణచెరువును హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్ సందర్శించారు. చెరువులలో కాలుష్యం నివారించి అవసరమైన అభివృద్ది పనులు చేపట్టాలని ఇటీవల స్థానిక కాంగ్రెస్‌పార్టీ నాయకులు హైడ్రా కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈమేరకు ఆయన ఎంఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికాగుప్తాతో కలసి ఎదులాబాద్‌కు చేరుకొని చెరువును పరిశీలించి వినాయకనిమజ్జనం జరిగే స్థలాన్ని బతుకమ్మఘాట్ నిర్వహణపై ఆరాతీశారు. మూసీ జలాలు, డంపింగ్ యార్డు వ్యర్థాల వల్ల చెరువు తీవ్రంగా కలుషితమవుతోందని, దీనిపై తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక నాయకులు హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తెచ్చారు. చెరువును కాలుష్యం బారినుంచి కాపాడాలని బిజెపి జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావు, ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డిలు ఆయనకు ఈసందర్భంగా వినతిపత్రం అందజేశారు. ఎటువంటి శుద్ధి ప్రక్రియ లేకుండానే డంపింగ్ యార్డు నుండి వస్తున్న చెత్త, మురుగునీరు, రసాయన వ్యర్థాలు నేరుగా లక్ష్మీనారాయణ చెరువులోకి చేరుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. డంపింగ్ వ్యర్థాలు రాకుండా ప్రహరీగోడ నిర్మించాలని, ప్రత్యామ్నాయమార్గాలకు మళ్లించాలని కోరారు. బీజేపీ ప్రతినిధుల బృందం సమర్పించిన వినతిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందించి చెరువు పరివాహక ప్రాంతంలో కబ్జాలకుగురైన స్థలాలను త్వరలోనే గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువులోకి చేరుతున్న కలుషిత నీటిని శుద్ధి చేసేందుకు వీలుగా అధునాతన ఎస్‌టిపి, ఈటిపిలను ఏర్పాటు చేయడానికి తక్షణమే సమగ్రనివేదిక సిద్ధంచేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వ ఆమోదంపొంది, పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు శాయశక్తులా కృషిచేస్తానని ఆయన ఈసందర్భంగా భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్‌కాంగ్రెస్ అధ్యక్షులు అమరేందర్, సహకార సంఘం డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ డైరెక్టరు సత్తయ్య, విశ్వనాథం, యుగంధర్‌గౌడ్, బాలక్రిష్ణ, జంగయ్య, అంజనేయులు, నవీన్, మల్లేష్, హరిక్రిష్ణ, రమేష్, కృష్ణ, శ్రీనివాస్, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యాన్ని సహించబోం..

-తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్

బియ్యం సరఫరాను పరిశీలిస్తున్న ఛైర్మన్ గోలి శ్రీనివాస్

మేడ్చల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల, చిన్నారుల, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేవ శ్రద్ద వహిస్తూ వారికి పౌష్టికాహారం అందిస్తున్నదని, అందులో ఏలాంటి నిర్లక్ష్యం వహించిన ఉపేక్షి చేది లేదని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్, సభ్యులు ఆనంద్, జ్యోతిలు మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్‌లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ముందుగా మేడ్చల్ పట్టణంలోని చౌక ధరల దుకాణాలను పరిశీలించి డీలర్‌తో స్టాక్ వివరాలు, రిజిష్టర్ల నమాదులను పరిశీలించారు. చౌకధరల దుకాణం వద్ద ఫిర్యాదుల బాక్సులు అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా ఫిర్యాదులు ఇచ్చేందుకు గాను జిల్లా సివిల్ సప్లై అధికారి, మండల తహసీల్దార్ల ఫోన్ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలని ఛైర్మన్ సూచించారు. సన్న బియ్యం అందుతున్నాయా అని, మీకు సౌకర్యవంతంగా డీలర్లు బియ్యం అందిస్తున్నారా అని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిష్టాపూర్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ని సందర్శించి డైనింగ్ హాల్, స్టోర్ రూం పరిశీలించి ఎక్స్పైరీ డేట్ చెక్‌చేస్తూ సరుకులను వాడాలని, నాణ్యమైన సన్నబియ్యం మాత్రమే వండాలని, బియ్యం నాణ్యత లేకుంటే వెంటనే అధికారులకు తెలియజేసి మార్చుకోవాలని తెలిపారు. విద్యార్థుల హెల్త్ చెకప్ రిజిష్టర్లను పరిశీలించి రక్తహీనత ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్దవహించి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. అనంతరం బృందసభ్యులు జిల్లాలోని దమ్మాయి గూడలో పర్యటించారు. విద్యార్థులకు రుచికరమైనభోజనం అందించా లని, తాము మళ్లీవచ్చి పరిశీలిస్తామని అధికారులను హెచ్చరించారు. అనంతరం దమ్మాయిగూడపరిధి అంబేద్కర్‌నగర్, జవహర్‌నగర్ మల్కాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఛైర్మన్‌సభ్యులు సందర్శించారు. ఈ పర్యటనలో కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, నోడల్ అధికారి సాంబశివరావు, జిల్లా బిసి, ఎస్సీ, ఎస్టి, మైనారిటి సంక్షేమ అధికారులు ఝాన్సీరాణి, వినోద్ కుమార్, పద్మజా, కాంతమ్మ, డిఎం అండ్ హెచ్ఓ ఆనంద్, సివిల్ సప్లై అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారిణి శారద, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని అధికారులకు వినతి



మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మేడ్చల్, సెప్టెంబరు 11. ప్రభాతవార్త:

సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ఎల్లంపేట మున్సిపల్ బీజేపీనాయకులు మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి, మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్, ఎల్లంపేట్ మున్సిపల్ అధ్యక్షుడు ఎక్కల్ దేవి శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు కొరివి పోచయ్య, వార్డు కౌన్సిలర్లు అర్చన శ్రీనివాస్, శారదరాజునాయక్, పార్టీ ప్రధానకార్యదర్శి మహేష్, నాయకులు దేవేందర్‌రెడ్డి, రవినాయక్, ఆంజనేయులు, లక్ష్మణ్, పద్మారావు, సత్యనారాయణ, ప్రవీణ్‌ముదిరాజ్, దివాకర్‌రెడ్డి, వినయ్‌చారి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణ పనులను వేగంవతం చేయాలి

-కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

కొడంగల్ పట్టణంలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి,మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ అన్నారు.శుక్రవారం కొడంగల్ పట్టణంలోని భూత్పూర్,చించోళీ జాతీయ రహదారి పనుల్లో భాగంగా పట్టణంలోని తాండూర్ వెళ్ళే ప్రధాన రహదారిపై చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించి, నిర్మాణ నాణ్యత,పనుల వేగం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. మున్సిపల్ వైస్‌చైర్మేన్ శంకర్ నాయక్ తదితరులున్నారు.

పర్యావరణహిత మట్టి వినాయకులను పూజించాలి

మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నర్సాపూర్ రూరల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
నర్సాపూర్ మండల పరిధిలోని నాగులపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణహిత మట్టి వినాయకులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయకులను పూజించడం ఎంతో అవసరమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలను తయారుచేయించారు. మట్టివినాయకులను తయారుచేసిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు తాము తయారుచేసిన మట్టి వినాయకులను తమ ఇళ్లలో పూజించి, పర్యావరణహితంగా వినాయకచవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, రాజు, వెంకటరమణ, స్వర్ణలత, శారద, అనంతరామ్‌గౌడ్ తో పాటు ఎకో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడాపోటీల్లో గాయపడిన సింగూర్ విద్యార్థి

-మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

చౌటకూరు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
పుల్కల్ మండలస్థాయి ఆటల పోటీల్లో భాగంగా గురువారం రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో (రెసిడెన్షియల్ స్కూల్ వర్సెస్ సింగూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్) ఆడుతున్న సమయంలో సింగూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో 10వతరగతి చదువుతున్న విద్యార్థి అలుగోల గంగాధర్ భుజం ఎముకవిరిగి తీవ్రంగాగాయపడ్డాడు. వెంటనే స్పందించిన జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, దత్తురావు, ప్రసాద్ శర్మలు మండల విద్యాధికారి శంకర్‌కు సమాచారం అందించి, విద్యార్థిని హుటాహుటిన సంగారెడ్డిలోని సిటీ హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స అందించారు. ఈ విషయం తెలుసుకున్న సింగూర్ ప్రజా ప్రతినిధులు గ్రామ సర్పంచ్ నందికంటి శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఎర్ర శేఖర్ పుల్కల్ మండల విద్యాధికారి శంకర్‌తో మాట్లాడి గాయపడిన విద్యార్థికి మెరుగైనచికిత్సలు అందేలా చూడాలని వారు కోరారు. మండల విద్యాధికారి తక్షణమే చొరవ తీసుకొని చికిత్సకు అన్ని ఏర్పాట్లుచేశారు. విద్యార్థి తల్లిదండ్రులను గ్రామ ప్రజాప్రతినిధులు కుటుంబాన్ని పరామర్శించారు. విద్యార్థికి అండగా నిలిచిన ఎంఈఓ, ప్రహ్లాద్, సత్యం, యాదగిరి, ఉపాధ్యాయులకు సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు తల్లిదండ్రులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వీస్ రోడ్డుపై పాలిటెక్నిక్ విద్యార్థుల నిరసన..

చౌటకూర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
చౌటకూర్ మండల పరిధిలోని శివంపేట్ పాలిటెక్నిక్ కళాశాలలో అమలు చేస్తున్న శక్తి విధానాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. శుక్రవారం మండలంలోని శివంపేట గ్రామం వద్ద ఉన్న సర్వీస్ రోడ్డుపైకి చేరుకున్న విద్యార్థులు నిరసన వ్యక్తంచేశారు. శక్తి విధానంలో ఉన్న అంశాలపై విద్యార్థులకు స్పష్టత ఇవ్వాలని, విధానం అమలుతో తమ చదువులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. తమ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. విద్యార్థుల డిమాండ్లపై ప్రభుత్వం, సాంకేతిక విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఇంక్రిమెంట్‌లో వివక్ష ఎందుకు..?

-చౌటకూర్ ఈఎంపీఈఈ డిస్టిల్లరీ గేటు ముందు కార్మికుల ఆందోళన

కంపెనీ మేనేజర్‌తో మాట్లాడుతున్న స్థానిక సర్పంచ్ పార్కల రాంరెడ్డి

చౌటకూర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని ఈఎంపీఈఈ డిస్టిల్లరీ పరిశ్రమలో వేతనాలపెంపు, ఇంక్రిమెంట్ల విషయంలో యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై పర్మినెంట్ కార్మికులు ఆందోళనకు దిగారు. పరిశ్రమలో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులు మొత్తం 90మంది ఉండగా, వారిలో కేవలం 17మందికి మాత్రమే స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వడంపై మిగిలిన కార్మికులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. అందరికీ సమానంగా ఇంక్రిమెంట్ ఇవ్వడంతో పాటు వేతనాలు పెంచాలని డిమాండ్‌చేస్తూ పరిశ్రమ గేటు ఎదుట నిరసనచేపట్టారు. తమకు వేతనాల పెంపు విషయంలో అన్యాయం జరుగుతోందని కార్మికులు ఆరోపించారు. తమ డిమాండ్లను పట్టించుకోకుండా సమస్యను జాప్యంచేస్తే ఆందోళనను మరింత ఉధృతంచేస్తామని కార్మికులు హెచ్చరించారు. కార్మికులసమస్యపై యాజమాన్యం చర్చలుజరిపి, అందరికీ న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సన్నబియ్యం అందిస్తున్న ఘతన సిఎందే

-పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు అత్తు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
జిల్లా కేంద్రంలోని 9వవార్డులో పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎండి ఇమామ్(అత్తు) అర్హులైన లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీచేసి మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంతో రేషన్‌కార్డు లేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డు అందిచడం జరుగుతుందన్నారు. పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత సిఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎర్రవెల్లిలో దళితులు వచ్చి నిరసనచేస్తే పసుపు నీళ్లతో కడగడం దళితులను అవమానించడమేనని తెలిపారు. మొదటి నుంచి అవమానిస్తున్న కెసిఆర్, బిఆర్ఎస్ నాయకులకు మళ్లీ గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో 9వ వార్డు ఆఫీసర్ పూజ, డీలర్ రవీందర్‌రెడ్డి, పార్టీ నాయకులు గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిదశలో కీలక మలుపు..

నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకమైన దశ అని పెద్ద శంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి, మండల విద్యాధికారి వి.శేఖర్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నతశిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు అనంతరాజుశర్మ, ప్రభాకర్, మల్లేశం, రాజుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ అరాచకానికి ప్రజలే బుద్ధి చెబుతారు

-డిసిసి అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి

-సంగారెడ్డిలో కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ

సంగారెడ్డి ర్యాలీలో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి, నాయకులు

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరును నిరసిస్తూ సంగారెడ్డి డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంగారెడ్డి పట్టణంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రామ్‌నగర్‌లోని జగ్గారెడ్డి నివాసం నుంచి పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నిర్మలా జగ్గారెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అరాచకం, గూండాయిజానికి పాల్పడ్డారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజాసమస్యలపై మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇలాంటిఘటనలు ఎక్కడా జరగలేదని విమర్శించారు. బిఆర్ఎస్ నేతలు తమకు తామే నెట్టుకుని, పోలీసులపై దాడి చేసి, తిరిగి తామే బాధితులమన్నట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. దళితవర్గాన్ని అవమానించేలా బిఆర్ఎస్‌నేతలు చేసిన వ్యాఖ్యలు, చర్యలను రాష్ట్ర ప్రజలంతా గమనించారని పేర్కొన్నారు. దళితులు నడిచిన నేలను పసుపునీళ్లతో శుద్ధిచేయడం బిఆర్ఎస్ పార్టీ కుసంస్కారానికి, అనాగరికచర్యలకు నిదర్శనమని నిర్మలాజగ్గారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు సంక్షేమపథకాలు అందుతున్న తీరును జీర్ణించుకోలేకే బిఆర్ఎస్ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళితులను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న బిఆర్ఎస్ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోకతప్పదని, ఇందుకు భారీమూల్యం చెల్లించాల్సి వస్తుందని నిర్మలాజగ్గారెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్‌కిషన్, మున్సిపల్ ఛైర్మెన్ కూన వనితాసంతోష్, సిడిసి ఛైర్మెన్ రామ్‌రెడ్డి, నాయకులు జార్జ్, కిరణ్‌గౌడ్, సంతోష్, శ్రీకాంత్, రామ్‌చందర్‌నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, సందీప్ రెడ్డి, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య భవన నిర్మాణ శంకుస్థాపనకు జిల్లా నుంచి భారీసంఖ్యలో తరలిపోదాం

-రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న గంప శ్రీనివాస్

గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:
రాష్ట్ర ఆర్యవైశ్య భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడలోని ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన జిల్లా ముఖ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 13న హైదారాబాద్‌లోని ఉప్పల్ బాగాయత్‌లో గత ప్రభుత్వం ఇచ్చిన 5 ఎకరాల స్థలంలో సిఎం రేవంత్‌రెడ్డి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనుండడంతో జిల్లాలోని ఆర్యవైశ్యులు పెద్దసంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు అంజనేయులు, నవీన్‌కుమార్, హరినాథ్, లింగమూర్తి, శేఖర్, చంద్రశేఖర్, నవీన్, రవీందర్, సత్యనారాయణ, పాండురంగం, సత్యనారాయణ, మాధవి, నాగమణి, సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలకే పరిమితమైన ఎర్రచెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి

మున్సిపాలిటీ కేంద్రంలో ఎర్రచెరువు దృశ్యం

గుమ్మడిదల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రచెరువు మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధి అంశం సంవత్సరాలుగా హామీలకే పరిమితమవుతూ వస్తోంది. అభివృద్ధి పేరుతో పలుమార్లు ప్రకటనలు, హామీలు చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు మాత్రం ముందుకు కదలకపోవడంతో స్థానికప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడతామని చెప్పిన నాయకులు, అధికారులు ఆ మాటలను ఆచరణలోకి తీసుకురావడంలో విఫలమయ్యారని గ్రామస్థులు మండిపడుతున్నారు. గతంలో చెరువుకట్ట ఎత్తు పెంచేందుకు లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి పనులు చేపట్టినప్పటికీ సరైన ప్రణాళిక, పర్యవేక్షణ లేకపోవడంతో ఆ పనులు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయని స్థానికులు చెబుతున్నారు. అభివృద్ధి పేరుతో ఖర్చు చేసిన నిధులు వృథా అయ్యాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాలు గడిచినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొని ఎర్రచెరువు మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు గట్టిగా డిమాండ్‌చేస్తున్నారు.

హక్కులు సాధించేవరకు ముందుకుసాగుదాం

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
రైస్ మిల్లర్ల సమస్యలు తీరేవరకు పోరాటం సాగిస్తామని జిల్లా రూరల్ పారాబైయిల్డ్ మిల్లర్స్ అండ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చింత రాజు, ఉపాధ్యక్షులు గడ్డం రమేష్, ది సిద్దిపేట రైస్ మిల్లర్స్ అండ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్‌లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైస్ మిల్లర్ల భద్రత-రైతుల భవిష్యత్-కార్మికుల ఉపాధి అని జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన పోరాటంలో హక్కులు సాధించేవరకు ముందుకుసాగుదామన్నారు. రైస్ మిల్లులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఆకస్మికదాడులు నిలిపివేయాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి మిల్లింగ్ ఛార్జీ రూ.150కి పెంచాలన్నారు. జిల్లాలో రైస్‌మిల్లుల పరిశ్రమ తీవ్రమైన ఆర్థిక సమస్యలతో గడ్డుపరిస్థితుల్లో ఉందన్నారు. గత 3యేళ్ల నుంచి ఎఫ్‌సిఐ అధికారులు స్థలం చూపకపోవడంతో అదే సీజన్‌లో డెలివరీ చేయలేకపోతున్నామన్నారు. మహిళ సంఘాలకు జిల్లా నుంచి 20 రైస్ మిల్లులు అగ్రిమెంట్ చేయడానికి సిద్దంగా ఉన్నామన్నారు. ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నేతి కైలాసం, బాల్‌రాజు, కాచం కాశీ నాథ్, శివకుమార్, బాలకిషన్, బుచ్చయ్య, గోవిందారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్లపై పోలీసుల ఉక్కుపాదం...

-పాఠశాల పరిసరాల్లో యాంటీడ్రగ్ డాగ్ స్క్వాడ్ తనిఖీలు

రామాయంపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
పాఠశాల విద్యార్థులను మత్తుపదార్థాలకు దూరంగా ఉంచేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. రామాయంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాల్లో శుక్రవారం యాంటీడ్రగ్, డాగ్ స్క్వాడ్ బృందం విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. ఇటీవల గంజాయి చాక్లెట్ల విక్రయం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో పాఠశాల పరిసరాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల సమీపంలోని పలు కిరాణా దుకాణాల్లోనూ తనిఖీలు చేపట్టి, మత్తు పదార్థాల విక్రయం లేదా సరఫరాకు సంబంధించిన వివరాలను ఆరా తీశారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి, మత్తు పదార్థాలను విక్రయించడం, ప్రోత్సహించడం వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరించారు. ఎక్కడైనా మత్తుపదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే మత్తుపదార్థాలపై నిఘా మరింత పెంచుతామని పోలీసులు స్పష్టంచేశారు.

తూతూమంత్రంగా మండలస్థాయి అధికారుల సమావేశం

కొండపాక, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
కుకునూరుపల్లి మండలస్థాయి అధికారుల సమావేశం శుక్రవారం కుకునూరుపల్లి రైతువేదికలో ఎంపిడిఓ మహబుబ్ అలీ అధ్వర్యంలో నిర్వహించారు. కాగా ఈ సమావేశానికి 14మంది సర్పంచులకుగాను 5మంది మాత్రమే హాజరైనారు. వివిధశాఖల అధికారులు వారివారి శాఖల నివేదికలను చదివి సభకు వినిపించారు. కుకునూరుపల్లిమండలంలో జగదేవ్‌పూర్‌మండలం నుండి కలిసిన 4గ్రామాలకు విద్యుత్‌సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. లకుడారం సర్పంచ్ శిల్పానర్సింలుకు దేశస్థాయిలో 2వబహుమతి లభించినందుకు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు భద్రప్ప, రమేష్, భాస్కర్, కర్ణాకర్, ఎంపిఓ నాగభూషణం, ఎఎంసి చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

కోహెడ, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్రప్రభుత్వం ఈనెల 17న అధికారికంగా నిర్వహించాలని డిమాండ్‌చేస్తూ బిజెపి మండలశాఖాధ్యక్షులు జాలిగం రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేసి అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఆకుల రాములకు వినతిపత్రంఅందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఖమ్మం వెంకటేశం, స్వర్ణలతసురేందర్‌రెడ్డి, ఆమూల్యారాజశేఖర్ రెడ్డి, సతీష్, నర్సయ్య, తిరుపతి, అజయ్, లక్ష్మారెడ్డి, రాములు, శేఖర్, రాజయ్య, మహేష్, సతీష్,రమేష్, సాగర్, రాజు, రవితేజ, శేఖర్, శ్రీకాంత్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు సక్రమంగా సరఫరా చేయకుంటే నిరసన చేపడతాం

-రైతుబంధు రాష్ట్ర మాజీ నాయకులు దేవి రవీందర్

కొండపాక, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
రైతులకు 20 గంటల కరంటు ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా కరంటు సరఫరా చేయడంలో పూర్తిగా విఫలమైందని రైతు బందు రాష్ట్ర మాజీ కౌన్సిల్‌మెంబర్ దేవి రవీందర్ మాట్లాడుతూ అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ సర్పంచ్ బచ్చలి మహిపాల్‌తో కలిసి అయన మాట్లాడారు. కరంటు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నా సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం డైవర్ట్ పాలిటిక్స్‌తో కాలంవెళ్లదీస్తున్నారని అరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీసం 18గంటల కరంటైనా సరఫరా చేయకపోతే రైతులతో కలిసి విద్యుత్‌సబ్‌స్టేషన్‌ల ముందు నిరసనకార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లకుడారం ఉపసర్పంచ్ యెల్లు శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు చిక్కుడు నర్సింలు, సాయిలు, కర్ణాకర్, బిక్షపతి, దేవి నర్సింలు, సంతోష్, శ్రీనివాస్, చంద్రం, రాజు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు కోతలకు నిరసిస్తూ రైతుల రాస్తారోకో

కౌడిపల్లి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
కరెంట్‌కోతలతో పంటలు ఎండిపోతున్నాయంటూ మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం కౌడిపల్లి మండలం వెంకట్రావుపేట్ గేట్‌వద్ద మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సారా రామగౌడ్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి బిఆర్ఎస్ నేతలు నేషనల్ హైవే 765 డీపై శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. విద్యుత్‌సరఫరా సక్రమంగాలేక సాగుచేసిన పంటలకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికొచ్చేసమయంలో కరెంట్‌కష్టాలు సాగు కోసం బోర్లు, వ్యవసాయ మోటార్లపై ఆధారపడుతున్న రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా కీలకంగా మారింది. అయితే విద్యుత్ కోతల కారణంగా మోటార్లు పనిచేయక పంటలకు సకాలంలో నీరు అందడంలేదని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికే పెట్టుబడులుపెట్టి పంటలు సాగుచేశామని, ఇప్పుడు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు తమ డిమాండ్లపై నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. విద్యుత్ సమస్యకు తక్షణ పరిష్కారం చూపేవరకు వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. ఆందోళనకారులు రాస్తారోకో విషయం తెలుసుకున్న నర్సాపూర్ సీఐ రంగాకృష్ణ, స్థానిక ఎస్సై అమరేందర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి సంఘటనాస్థలానికి చేరుకున్నారు. రైతులు, బిఆర్ఎస్ నేతలను సముదాయించి ఆందోళన విరమించాలని కోరారు. హైవేపై రాస్తారోకో కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. ధర్నా రాస్తారోకో కారణంగా ఇరువైపులా సుమారు కిలోమీటర్ మేరకు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో వెంకట్రావుపేట్ గేట్ వద్ద పరిస్థితిని అదుపులోకి తీసుకొని ధర్నాచేస్తున్నవారిని అక్కడినుండి పంపించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ సర్పంచ్‌లు టిఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బొడ్మట్‌పల్లి వీరభద్రలయంలో ప్రత్యేకపూజలు

టేక్మాల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్ పల్లి గుట్టపై వెలసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణ అమావాస్యవేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా అర్చకులు స్వామివారికి విశేషంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చుట్టుపక్కల గ్రామాలనుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయనిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వీరభద్ర ఐటిఐలో ఘనంగా స్నాతకోత్సవం

గుమ్మడిదల, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరభద్ర ఐటీఐ కళాశాలలో 2024-26 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్లారియంట్ ఇండియా లిమిటెడ్ సంస్థ మానవ వనరుల నిర్వాహకులు బోను కిషోర్, స్టాండర్డ్ ఫ్లోరా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మానవ వనరుల నిర్వాహకులు కిషోర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీఐ విద్యార్థులు శిక్షణ అనంతరం పరిశ్రమల్లో శిక్షణార్థులుగా చేరి, తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. సాంకేతిక నైపుణ్యంతో పాటు క్రమశిక్షణను అలవర్చుకుని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మేకల శ్రీకాంత్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

-ఎస్ఐ కృష్ణారెడ్డి, ఎంఈవో సైదులు

జ్యోతిప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్ఐ కృష్ణారెడ్డి

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని రాణించాలని జగదేవ్‌పూర్ ఎస్ఐ జె.కృష్ణారెడ్డి, మండల విద్యాధికారి సైదులు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మాస్టర్ మైండ్ పాఠశాలలో గజ్వేల్ డివిజన్ ట్రస్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గజ్వేల్ డివిజన్ ట్రస్మ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్‌రెడ్డితో కలిసి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ క్రీడల్లో గజ్వేల్ డివిజన్‌లోని 31 ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొనగా, 250టీమ్‌లు 3వేలమంది విద్యార్థులతో పోటీలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు మానసికోల్లాసానికి, శరీరదారుఢ్యాన్ని పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడతాయని, క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి పైస్థాయికి వెళ్లి మంచి క్రీడాకారులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్‌గౌడ్, ట్రస్మ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఇన్నారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు సోమేశ్వర్‌రెడ్డి, గజ్వేల్ డివిజన్ కార్యదర్శి సంతోష్, కోశాధికారి విశ్వనాథ్, స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ ఇంచార్జ్ ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ ట్రస్మ కరస్పాండెంట్స్ గుర్జకుంట రామస్వామి, శశిధర్‌శర్మ, రావుఫ్‌ఖాన్, అంబదాస్, చంటి, జ్ఞానప్రకాష్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్, నరసింహారెడ్డి, ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

24గంటల కరెంటు కోసం రోడ్డెక్కిన రైతులు

వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంటు రావడం లేదని కేవలం 6 గంటలు మాత్రమే కరెంటు వస్తుందని 24 గంటలు కరెంటు సరఫరా చేయాలని సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ స్టేజీపైన శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పి అధికారంలోకివచ్చిన కాంగ్రెస్‌సర్కార్ కేవలం6గంటలు మాత్రమే సరఫరా చేయడంతో వరి చేను ఆరిపోయి, ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క నియోజకవర్గాలు హుస్నాబాద్, మెదక్‌లో 12గంటల కరెంటు ఇస్తే సిద్దిపేటలో మాత్రం 6 గంటలు మాత్రమే ఇస్తున్నారని విద్యుత్ అధికారులను నిలదీశారు. వ్యవసాయ రంగానికి 24 గంటలు ఇవ్వకుంటే ఆందోళనలు చేస్తామని రైతులు హెచ్చరించారు. రైతులు చేపట్టిన ఆందోళనకు బిఆర్ఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ అధికారులకు అందించారు. కార్యక్రమంలో మాజీ సుడాచైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లఫోరం అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి, బట్టు భాస్కర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే నారాయణరావుపేట సబ్‌స్టేషన్ ఎదుట వ్యవసాయ రంగానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ అధికారులకు అందించారు.

ముదిరాజ్ నాయకుల ముందస్తు అరెస్టు

ముందస్తుగా పోలీసులు అరెస్టుచేసిన ముదిరాజ్ నాయకులు

రామాయంపేట, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
ముదిరాజ్ కులస్థులను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ సంఘం చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో రామాయంపేటలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. శుక్రవారం హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ముదిరాజ్ సంఘం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని సంఘంనాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌పై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు శుక్రవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి సంఘం పిలుపునిచ్చింది. ఈనేపథ్యంలో హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ముదిరాజ్ సంఘంనాయకులను పోలీసులు మార్గంమధ్యలోనే అడ్డుకుని ముందస్తుగా అరెస్టు చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్‌చేశారు. అరెస్టు అయిన వారిలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుడాల లింగం, కోశాధికారి గోపరి రవి, దేవుని నర్సింలు, రొయ్యల కిషన్, చిలక రాజయ్య, దేవుని సర్వయ్య, అక్కల సుధా, పొట్టి సాయిలు, ఎర్రం ఆంజనేయులు తదితరులున్నారు.